క్లుప్తంగా

మున్సిపల్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్


షార్ట్ సర్క్యూట్ జరిగిన విభాగం

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పొగలు కమ్మాయి. ఉదయం నుంచి విద్యుత్ సిబ్బంది లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేశారు. మధ్యాహ్నం విద్యుత్ సరఫరా పునరుద్ధరించగా షార్ట్‌సర్క్యూట్ కావడంతో దుర్వాసన,పొగలు వచ్చాయి. వెంటనే సిబ్బంది బయటకు పరుగులు తీశారు. అక్కడే ఉన్న మున్సిపల్ ఏఈ విద్యుత్ విభాగానికి సమాచారమందించడంతో సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం



విద్యార్థిని యశస్వినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలిరూరల్:అంతర్జాతీయ జీవ వైవిధ్య (బయోడైవర్సిటీ) దినోత్సవం సందర్భంగా విశాఖ పట్నంలోని గోపాలపట్నం ఉన్నత పాఠశాలలో జోనల్‌స్థాయి వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. ఈపోటీల్లో మండలంలోని పెంట గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థి ని తమ్మిరెడ్డి యశస్విని ప్రథమ స్థానంలో నిలిచిందని ఆ పాఠశాల హెచ్‌ఎం రమణ తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు గైడ్ టీచర్ సింహాచలం, తదితరులు శుక్రవారం అభినందించా రు. ఈనెల 22న అమరావతిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతులమీదుగా విద్యార్థిని బహుమతి అందుకోనుందని హెచ్‌ఎం చెప్పారు.

తాగునీటి కుళాయిల పరిశీలన

రేగిడి: మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, ఆడవరం, లక్ష్మీపురం, దేవుదళ, తదితర గ్రామాల్లో తాగునీటి కుళాయిలను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ శుక్రవారం పరిశీలించారు. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిని వృథా చేయవద్దన్నారు.నీటిని పొదుపుగా వాడితే ఇతర ప్రాంతాలకు కూడా తాగునీరు సరఫరా చేయవచ్చని అన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి: రైతులు పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయ వైపు మళ్లాలని ఏపీ సీఎస్ఎఫ్ డీపీఎం ఆనందరావు సూచించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నవధాన్యాల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. 23 రకాల విత్తనాలను సంప్రదాయ బద్ధంగా కలగలిపారు. వీటిని 5 కిలోల బ్యాగుల్లో వేసి ఎమ్మెల్యే బేబి నాయన చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. విత్తనాల ప్రాముఖ్యతపై ఎమ్మెల్యే బేబి నాయన రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీ శ్యాంసుందర్,బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జి రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉరిటి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు


చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ భరద్వాజ్

రేగిడి: స్థానిక ఎమ్మార్సీలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎం.భరద్వాజ్ శుక్రవారం ఫిజియోథెరపీ సేవలందించారు. ఎమ్మార్సీలో అందించే ఫిజియోథెరపీ సేవలను ప్రత్యేక అవసరాల పిల్లలు వినియోగించుకునేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఫిజియోథెరపీపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, క్రమం తప్పకుండా ఇంటి వద్ద ఇలా చేస్తే పిల్లల్లో అంగవైకల్యం కొంత మేర తగ్గుతుందని చెప్పారు. ఎంఈఓలు ఎం.వి. ప్రసాదరావు, ఎరకయ్య, ఐఈఆర్‌పీలు యు.మహేశ్వరి, రాంబాబు పాల్గొన్నారు.

అన్నదాతకు కష్టకాలం..!

- రైతులకు రాయితీపై అందని వ్యవసాయ పరికరాలు,యంత్రాలు
- ప్రైవేటు వ్యక్తుల వద్ద అద్దెకు యంత్రాలు తెచ్చుకుంటున్న రైతులు
- పచ్చిరొట్ట, నవధాన్యాల విత్తనాలు కూడా అందించని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)ద్వారా రాయితీపై యంత్ర పరికరాలు
- ఒక ఏడాది పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టిన కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో ఏటా ఠంచన్‌గా అందిన పెట్టుబడి సాయం


రేగిడి మండలం అంబఖండి గ్రామంలో వరి వెద సాగుకు దుక్కి చేస్తున్న రైతు (ఫైల్)

రాజాం: అన్నదాతను కష్టకాలం వెంటాడుతోంది. శ్రమనే నమ్ముకున్న రైతన్నకు కూటమి ప్రభుత్వంలో చేయూత కరువైంది. కల్లబొల్లి మాటలు చెప్పడమే తప్ప కూటమి పాలనలో హామీలు అమలు కావడం లేదు. రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుభరోసా పథకం పేరిట ఏటా రూ.13,500 పంటల సాగుకు పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందించేంది. తాము అధికా రంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఖరీఫ్ సీజన్ గడిచిపోగా, రబీ సీజన్ కూడా ముగిసిపోతోంది. మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చేస్తున్నా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా రైతులకు అందించలేదు. రాయితీ విత్తనాల దగ్గర నుంచి వ్యవసాయ పరికరాల వరకు 20 రకాల సేవలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఇళ్ల వద్దకు అందించేది. ఇప్పుడు ఆ సేవల ఊసేలేదు. రైతు కష్టాన్ని గుర్తించే నాథుడూ లేడు.

ఒక్క పరికరం ఇస్తే ఒట్టు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతీ రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల (సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ పరిధిలో రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి ఒక్కో సంఘానికి డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంక్ రుణంతో రూ.12 నుంచి రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్లు, దుక్కు సెట్లు, నూర్పిడి యంత్రాలు, రోటో వీటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు తదితర పరికరాలు అందించారు. ఈ యంత్ర పరికరాలను సంఘంలోని రైతులు వినియోగించుకోవడంతో పాటు గ్రామా ల్లోని మిగతా రైతులకు నామమాత్రపు అద్దెకు ఇచ్చేవారు. అలాగే 50 నుంచి 90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింకర్లు, పైపులు, రాయితీ పై సోలార్ పంపు సెట్లు కూడా అందేవి. ప్రస్తుతం ఇవి అటకెక్కాయి. ఖరీఫ్ ముగిసే సమయానికి అందాల్సిన కొత్త నూర్పిడి యంత్రాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించలేదు. కొత్తగా మండలాలకు రాయితీపై ట్రాక్టర్లు రాలేదు.

పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల మాటే లేదు..

గత ప్రభుత్వం హయాంలో వేసవిలో అన్ని గ్రామాల్లో రైతులకు 50 శాతం రాయితీపై నవధాన్యాల విత్తనాలు ఇచ్చేవారు. అలాగే పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు కూడా అందించేవారు. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అక్కడక్కడా రైతులకు నవధాన్యాల విత్తనాలు అందిస్తున్నారే తప్ప పూర్తి స్థాయిలో ప్రభుత్వం వీటిని పంపిణీ చేయడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వస్తున్నాయి. మరో వైపు పంటపొలాల్లో మట్టి నమూనాల సేకరణ, వాటి పరీక్షలు అటకెక్కాయి. గతంలో ప్రతీ పంచాయతీలో మట్టి నమూనాలను సేకరించి నియోజకవర్గ కేంద్రం లోని అగ్రిల్యాబ్‌లో పరీక్షలు చేసి వాటి ఫలితాల పత్రాలను రైతులకు అందించి, ఏ పంటలు సాగు చేయాలో అవగాహన కల్పించేవారు. ఈ ఏడాది ఈ విధానం లేకపోవడంతో రైతులు బేల చూపులు చూస్తున్నారు.

పెట్టుబడి పెరిగిపోతోంది.

గతంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకంతో పాటు రైతు మిత్ర సంఘాలకు, పీఏసీఎస్ కేంద్రాలకు ట్రాక్టర్లు ఉండేవి. వీటిని అద్దెకు తెచ్చి దుక్కులు చేసేవాళ్లం. నామమాత్రపు అద్దెలు ఉండేవి. ప్రస్తుతం ఇవి ఎక్కడా కనిపించడం లేదు. దుక్కుల కోసం ప్రైవేటు వ్యక్తుల ట్రాక్టర్లను పెట్టాల్సి వస్తోంది. ఎకరానికి దుక్కుకు రూ.1,500 వరకు తీసుకుంటున్నారు. అన్నింటికీ పెట్టుబడి పెరిగిపోతోంది.

– గేదెల రాంబాబు, రైతు, రేగిడి మండల కేంద్రం

గతంలో పరికాలు ఇచ్చారు..

గత ప్రభుత్వం రైతులకు యంత్రపరికరాలు అందించింది. మా బంధువులకు రాయితీపై వరి నూర్పిడి యంత్రం ఇచ్చారు. ఈ యంత్రం ద్వారా తక్కువ పెట్టుబడితో పంట నూర్పిడి చేసుకున్నాం. ఈ ఏడాది ఎవరికీ రాయితీపై యంత్రాలు రాలేదు. జొన్న పిక్కల నూర్పిడికి ప్రైవేటు వ్యక్తి వద్ద యంత్రం తీసుకువస్తే ఎకరానికి రూ.4 వేలకు పైగా తీసుకున్నారు.

– కొడిశ రామజోగులు, రైతు, రాజాం మండల కేంద్రం

నిషేధంపై నిర్లక్ష్యం


గాంధీనగర్ వద్ద కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

రాజాం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం అధికమైంది. ప్రజలు వాడేసి విసేరిసిన ప్లాస్టిక్ బాటిల్లు, కవర్లు, ఇతర వ్యర్థాలు మురుగు కాలువల్లో పేరుకుపోతున్నాయి. ఇవి కాలువల్లో అడ్డంగా ఉండిపోతుండడంతో మురుగునీరు ముందుకు ప్రవహించడం లేదు. ఫలితంగా పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రాజాం పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉండేది. ప్లాస్టిక్ నిషేధంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పుడుప్లాస్టిక్ నిషేధం పట్టణంలో అమలుకాక పోవడంతో మున్సిపల్ అధికారుల తీరును పర్యావరణ పరిరక్షణ సమితి తప్పుపడుతోంది. – రాజాం

జాతీయ రహదారిపై మురుగు ప్రవాహం


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు నీరు


శివాలయం సమీపంలో రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు


ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయం వద్ద ఇలా..

రామభద్రపురం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు గాంధీబొమ్మ జంక్షన్ నుంచి రోడ్డుకు ఇరువైపులా డ్రేనేజీ ఆనవాళ్లే లేవు.సమీప ఇళ్ల నుంచి వాడుక నీరంతా రోడ్డుపై చేరుతోంది. డ్రైన్లపైన పలువురు దుకాణాదారులు, ఇళ్ల యజమానులు శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతో సిల్టు తొలగింపు పనులు సజావుగా సాగడం లేదు. దీంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ మార్గంలో వెళ్లే వారంతా మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు,అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– రామభద్రపురం

పశువులశాలగా ఎస్‌డబ్ల్యూపీసీ



తెర్లాం మండల కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ) పశువుల శాలగా రూపాంతరం చెందింది. నిబంధనల ప్రకారం పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో సేకరిం చిన చెత్తను ఈ కేంద్రానికి తరలించి తడి, పొడి చెత్తను వేరు చేయాల్సి ఉంటుంది. అలాగే తడి చెత్తతో సేంద్రియ ఎరువు, కుండీల్లో వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు తక్కువ ధరకు విక్రయించాలి. కానీ ఇక్కడ అవేమీ జరగడం లేదు. స్థానికులు ఈ కేంద్రాన్ని పశువుల శాలగా, కార్ల పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. – తెర్లాం

అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రచారం


ఆశ వర్కర్లతో కలిసి మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేస్తోందని కార్మిక సంఘాల ఐక్యవేదిక నేత సీహెచ్. రామ్మూర్తినాయుడు ఆరోపించారు. రాజాంలో శుక్రవారం ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఆశ వర్కర్లకు అధిక వేతనాలు చెల్లిస్తున్నామని అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేయడం తగదన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయినా ఆశ వర్కర్లను ఇంకా ఉద్యోగులుగా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్క ర్లను క్లాస్–4 ఉద్యోగులుగా గుర్తించి, పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశా రు. సంబంధంలేని పనులు అప్పగించి పనిభారం పెంచవద్దని, ప్రతీ పీహెచ్‌సీలో ఆశలకు వెయిటింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని, లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి కార్మిక చట్టాలను పటిష్ట పర్చాలని కోరుతూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఆశ వర్కర్లు సూర్యమణి, పార్వతి, చిన్నమ్మడు, రమణమ్మ, రాణి, గౌరమ్మ, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవరచుకోండి


శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

రాజాం సిటీ: విద్యార్థులు చిన్నతనం నుంచే ఆధ్యాత్మికత అలవరచుకోవాలని, అందుకు యోగా ఎంతో దోహదపడుతుందని స్థానిక యోగా వికాస్ నిర్వాహకురాలు కె.సౌందర్య అన్నారు. పది రోజులుపాటు నిర్వహించనున్న రెండో విడత వేసవి శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించా రు. విద్యార్థులతో ఆధ్యాత్మిక శ్లోకాలు చెప్పించారు. అలాగే నీతి కథలు చెప్పడంతో పాటు యోగాపై శిక్షణ ఇచ్చారు.

సర్వేలను వేగవంతం చేయాలి


పంచాయతీ కార్యదర్శులకు మొక్కలు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: అన్ని గ్రామపంచాయతీల్లో ప్రభుత్వం సూచించిన సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్లు, ఆధార్ నెంబర్ ఎంట్రీ, ఈ–సర్వీసులు, లైబ్రరీ సెస్, డైలీ గార్బేజ్ కలెక్షన్, పీఆర్ వన్ యాప్, ఆర్‌టీఐ యాక్ట్, పీఎం విశ్వకర్మ పెండింగ్ తదితర సర్వేలపై ఆరా తీశారు. పెండింగ్ సర్వేలన్నీ వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ప్రతీ నెల మూడో శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి, 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వాటిని నాటాలని సూచించారు.

ర్యాలీని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: ఉష్ణ తాపం నుంచి ఉపశమనం పొందే విధానాలపై 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం నిర్వహించనున్న అవగాహన ర్యాలీలని జయప్రదం చేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ర్యాలీలో ఎన్‌జీఓలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, ఆస్పత్రి పరిసరాల్లో మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. అలాగే ప్రతీ పంచాయతీలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

దొంగ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు

- ఉపాధి పనులపై సమీక్షలో డ్వామా పీడీ శారదాదేవి
- చిత్తారపురం ఫీల్డ్ అసిస్టెంట్‌కు నోటీసులు


జావాం గ్రామ వేతనదారులకు తక్కువ వేతనం వస్తుండడంపై ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను నిలదీస్తున్న పీడీ శారదాదేవి

సంతకవిటి: ఉపాధి హామీ పనులకు సంబంధించి దొంగ మస్తర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి హెచ్చరించారు. మండల ఉపాధి హామీ పథకం సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వలసలు వెళ్లిన వారికి, కళాశాలలకు వెళుతున్న వారి పేరిట దొంగ మస్తర్లు వేస్తున్నట్లు ఎవరైనా రాత పూర్వ కంగా ఫిర్యాదు చేస్తే.. విచారించి బాధ్యులపై చర్యలకు వెనుకాడబోమని అన్నా రు. సరాసరి ఒక్కో వేతనదారుడికి 66 రోజులే పని కల్పించగలుగుతున్నా మని, 100 రోజులు పని కల్పించలేమా అని ప్రశ్నించారు. సాగునీటి కాలువల్లో పూడిక తీతలు సరిగా చేపట్టడం లేదని, మండలంలో 240 ఫారం పాండ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు 11 మాత్ర మే వందశాతం పూర్తయ్యాయని అన్నారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జావాంలో రోజుకు రూ.105 వేతనం

జావాం గ్రామంలో వేతనదారులకు రోజుకు 105 రూపాయలు మాత్రమే వేతనం వస్తుండడంపై ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, టీఏలను డ్వామా పీడీ నిలదీశారు. కాకరాపల్లి, వంజరాం గ్రామాల్లో పనులు ప్రారంభం కాకపోవడానికి కారణాలను ఏపీఓ ఆర్.హరనాథరావును అడిగి తెలుసు కున్నారు. చెరువులు లేని గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, ఏ నెలలో ఏయే పను లు చేపట్టాలో సరైన ప్రణాళిక తయారు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. పని ప్రదేశాలకు ప్లాస్టిక్ బాటిళ్లతో కాకుండా మట్టికుండ, బిందెల తో నీరు తీసుకువచ్చేలా వేతనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమీక్షా సమావేశానికి ముందు చిత్తారపురంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కొంతమంది వేతనదారుల ఫొటోలను ఆన్‌లైన్ అటెండన్స్ యాప్‌లో వేర్వేరు గ్రూపుల్లో పదేపదే అప్లోడ్ చేస్తున్నట్లు గుర్తించామని, ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఏపీఓ హరనాథరావు నోటీసులు అందించారని పీడీ తెలిపారు. సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ కె.సురేష్ కుమార్, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయ కులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి

సంతకవిటి:


రేగిడి: వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆశయ్య

రెవెన్యూ సేవల్లో జాప్యం లేకుండా సకాలంలో అందించాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశ య్య రెవెన్యూ సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ లు, విలేజ్ సర్వేయర్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని, రీసర్వేను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బి.సత్యం, డీటీ రంజిత్, ఆర్‌ఐ కృపారావు, రీసర్వే డీటీ మధు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

రేగిడి: గ్రామాల్లో రైతులకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య వీఆర్‌ఓలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఓలు రోజూ గ్రామాల్లోకి వెళ్లి రైతుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయా లన్నారు. ఇప్పటికే గుర్తించిన గ్రామాల్లో భూముల రీసర్వేను వేగవంతం చేయాలని, నీటి తీరువా వసూలు చేయాలని సూచించారు.తహసీల్దార్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి శివార్లలో ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో హెచ్‌సీ సీహెచ్ నాగేశ్వరరావు తదితర సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా మద్యం సీసాలతో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కోమటిపల్లికి చెందిన వెలమల లక్ష్మునాయుడు 30 మ ద్యం సీసాలను కలిగి ఉన్నట్టు గుర్తించారు. మద్యం సీసాలను సీజ్ చేశారు. నిందితుడి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేద్దాం

సంతకవిటి:బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వి.రత్నం అన్నారు. కిశోరీ వికాసం కార్యక్రమంపై ముకుందపురం గ్రామంలో శుక్రవారం అవగాహన కల్పించారు. కిశోరీ బాలికలు ఆరోగ్యజాగ్రత్తలు, పాటించాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరువు

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సునీల్‌కుమార్

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా నివేదికలు చదివి వినిపించగా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని సమస్యలను సభదృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయశాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో కూనాయవలస గ్రామ సర్పంచ్ బోడెల విజయబాబు స్పందించారు. తమ గ్రామ సచివాలయ హార్టీకల్చర్ అసిస్టెంట్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, రైతులకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. హార్టీకల్చర్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌ను రద్దు చేసి, అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఓ సునీల్‌కుమార్ స్పందిస్తూ హార్టీకల్చర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులు వచ్చాయని, ఆయన డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని ఉన్నతాధి కారులకు సిఫార్సు చేస్తానని చెప్పారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనుందని, రైతులు తమ వివరాలు సక్రమంగా ఉన్నదీ, లేనిదీ రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించుకోవాలని సూచించారు. సీఎస్‌డీటీ స్వర్ణలత మాట్లాడుతూ కొత్తరేషన్ కార్డుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. నెమలాంలో విద్యుత్ వైర్లు బాగా కిందకు వేలాడుతున్నాయని, ప్రమాదాలు జరగకముందే వాటిని సరిచేయాలని ఆ గ్రామ సర్పంచ్ నరసింహులు కోరారు. సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. ఈదురు గాలులకు రోడ్లపై పడిపోయిన చెట్లను ఆర్ అండ్‌బీ అధికారులు తొలగించడంలేదని కూనాయవలస సర్పంచ్ సభ దృష్టికి తీసుకురాగా...ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉమాలక్ష్మి, సత్యనారాయణ కలుగజేసుకొని రోడ్లపై కూలిన చెట్లను వెంటనే తొలగించాలని ఆర్‌అండ్‌బీ ఆర్‌ఐ శ్రీనివాసరావుకు సూచించారు. స్థానిక ఎస్‌ఐ సాగర్ బాబు తీరు సరిగా లేదని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాప్రతినిధులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు ఎస్‌ఐ కనీస గౌరవం ఇవ్వడం లేదని, ప్రజాప్రతినిధులు కానివారికి కుర్చీలు వేసి, ప్రజాప్రతినిధులను నిల్చోబెట్టి మాట్లాడుతూ అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఎంపీపీ స్పందిస్తూ ఎస్‌ఐ తీరు మార్చుకోకపోతే మండల సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి, ఎంపీడీఓ రాంబాబు, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.